పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్యం
- ఫలితాలనిస్తున్న ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- పేదల ఇంటికెళ్లి చికిత్స చేస్తున్న ప్రభుత్వ వైద్యులు


మండలంలోని మారుమూల గ్రామం నెలపర్తిపాడులో విలేజ్ హెల్త్ క్లినిక్

రామచంద్రపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను ఇంటి ముంగిటకే చేర్చి సీఎం జగన్మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. గతంలో పేదలకు అనారోగ్యం చేస్తే వ్యయప్రయాసలకు ఓర్చి పట్టణాలకు వెళ్లవలసిన పరిస్థితులు ఉండేవి. కానీ ముఖ్యమంత్రి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పేదల ఇంటికి వెళ్లి మరీ ప్రభుత్వ వైద్యులు సేవలు అందిస్తున్నారు.

రోగి ఇంటికి ప్రభుత్వ వైద్యం..

అనారోగ్యంతో అవస్థ పడుతున్న రోగి ఇంటి వద్దకే నాణ్యమైన ప్రభుత్వ వైద్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను రూపొందించింది. గతేడాది చివరలో ట్రయల్ రన్‌గా ప్రారంభమైన ఈ విధానం మంచి ఫలితాలనిచ్చింది. రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 9 విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీ పరిధిలో వెల్ల పీహెచ్‌సీలో పరిధిలో 8 విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్యం చేస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మిడ్ లెవెల్ ప్రొవైడర్‌లుగా బీఎస్సీ నర్సింగ్ చేసిన వారిని ప్రజలకు, పీహెచ్‌సీలకు మధ్య అనుసంధాన కర్తలుగా విధుల్లో నియమించారు. వీరివద్ద 67 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు నిత్యం అందుబాటులో ఉంటాయి. క్లినిక్‌ల పరిధిలో 104, పీహెచ్‌సీల వైద్యులు, అధికారులు, ఉద్యోగులు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో వైద్యసేవలందిస్తున్నారు. నిర్దేశించుకున్న షెడ్యూలు ప్రకారం నెలలో రెండు రోజులు 104 వాహనంలో వైద్య సిబ్బంది గ్రామనికి వెళ్లి సేవలందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడేవారికి కల్పతరువుగా మారి వారి బాధలను దూరం చేస్తున్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు ఇలా..

పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేసింది. వాటికి పక్కా భవనాలను సమకూర్చేందుకు నిధులను సైతం కేటాయించింది. ఒక్కో భవనానికి రూ.17.50 లక్షలు మంజూరు చేయగా అవి యుద్ధ ప్రాతిపదికన నిర్మితమవుతున్నాయి. మండలంలో 17 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గాను 6 భవనాలు నిర్మాణం పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆయా హెల్త్ క్లినిక్‌లలో రోజుకు సుమారు 40 నుంచి 45 మందికి వైద్య సేవలు అందుతున్నాయి. రోజుకు సుమారు 20 మందికి టెలి కన్సల్టేషన్ సేవలందిస్తున్నారు.

పర్యవేక్షణకు పెద్దపీట

ప్రజా వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం విలేజ్ టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఈ ఏడాది మార్చి 28న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ పని చేస్తుంది. బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), మిడ్‌లెవెల్ ప్రొవైడర్ ప్రతి గ్రామంలో టాస్క్ ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఆశ, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక్కొక్కరు చొప్పున, స్కూల్ హెల్త్ అంబాసిడర్, డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు కమిటీలో సభ్యులుగా ఉంటారు. వారంతా వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

ఇలాంటి వైద్య సేవలను ఎన్నడూ చూడలేదు



గత 29 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్నాను. అయితే ఇన్నేళ్ల సర్వీసులో ప్రజలకు ఈ స్థాయిలో వైద్య సేవలు అందించిన ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేదు. రక్త పరీక్షలకు అధునాతన యంత్రాలు, అన్ని రకాల వ్యాధులకు 64 రకాల మందులు అందుబాటులో ఉంచడం నిజంగా అద్భుతం. పీహెచ్‌సీలో ఒకరు, ప్రజల్లో ఇంటికి వెళ్లి మరొకరు వైద్యాధికారులు వైద్య సేవలు అందించేలా రూపొందించిన విధానం ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది.

– కె.గోవిందబాబు, ఎంపీహెచ్‌ఈఓ, ద్రాక్షారామ పీహెచ్‌సీ

జగనే సీఎంగా ఉండాలి



మా ఆయన సిరిపల్లి సత్తిబాబు, 62 సంవత్సరాలు. గుండె వ్యాధితో బాధపడుతున్నారు. బీపీ, సుగర్ కూడా ఉన్నాయి. గతంలో మందుల కోసం, వైద్యం కోసం చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కానీ సీఎం జగన్‌బాబు మా ఇంటికే డాక్టర్‌ని పంపి వైద్యం చేయిస్తున్నారు. మందులు కూడా ఇంటి దగ్గరే ఇస్తున్నారు. వేరే అవసరం వచ్చినా క్లినిక్ దగ్గరికి వెళ్లి అవసరమైన మందులు తెచ్చుకుంటున్నాం. ఈ పెద్ద వయస్సులో ఇంటి దగ్గరే వైద్యం, మందులు అందిస్తున్న సీఎంగా జగనే పది కాలాలు ఉండాలి. మా లాంటి పేదలను చల్లగా చూడాలి.

– సిరిపల్లి మాణిక్యాంబ, ద్రాక్షారామ

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు

కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు


సెల్ టవర్ ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గొల్లపుంత రోడ్డు వాసులు

మండపేట: జనావాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేస్తే చూస్తూ ఊరుకోబోమని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మెండు బాపిరాజు అన్నారు. స్థానిక 16వ వార్డు గొల్లపుంత రోడ్డులోని పాత వైన్ షాపు ఎదురుగా స్థలంలో సెల్ టవర్ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలపై శనివారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ వార్డు కౌన్సిలర్ బాపిరాజు మాట్లాడుతూ టవర్ నుంచి వచ్చే రేడియేషన్ వలన చుట్టుపక్కల వారు ప్రాణాంత వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. చుట్టు జనావాసాలు ఉన్నందున టవర్ ఏర్పాటు చేయడం తగదన్నారు. ఈ మేరకు టవర్ ఏర్పాటు ప్రయత్నాలు నిలుపు చేయించాలని కోరుతూ స్థానికులంతా మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. సెల్ టవర్లు ఏర్పాటు చేసే ముందు ప్రజాభిప్రాయం సేకరించుకుండా ఏకపక్షంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు స్థానికులు తెలిపారు. మాజీ కౌన్సిలర్ సిద్ధిరెడ్డి రామకృష్ణ, గండి కొండయ్య, గనిశెట్టి సూరిబాబు, కంఠంశెట్టి మల్లేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శిల్పకళాకారులు, కార్మికుల భవనం ప్రారంభం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలోని శిల్ప కళాకారులు, తాపీ మేస్త్రి, వడ్రంగి, తదితర నైపుణ్య కార్మికుల ఐక్యతకు కృషి చేస్తున్నట్టు గ్రామ ఐక్య కార్మిక సంఘం నాయకులు తెలిపారు. అంగరలోని సూర్యారావుపేట రోడ్డులోని వాటర్ ట్యాంక్ సమీపంలో కొత్తగా నెలకొల్పిన శ్రీపెద్దింశెట్టి సూర్యనారాయణ మూర్తి శిల్ప కళాకారులు, కార్మికుల భవనాన్ని శనివారం నాయకులు ప్రారంభించారు. నైపుణ్య కార్మిక సంఘాల సమావేశాలు నిర్వహణ, వృత్తి నైపుణ్య అవగాహన సమావేశాలు నిర్వహించుకునేందుకు గ్రామ ఆది శిల్పకళాకారుడు పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి పేరున భవనాన్ని నిర్మించుకున్నామని నాయకులు, పంచాయతీ ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ముత్త అబ్బు, పెద్దింశెట్టి రామస్వామి, పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి, చీకట్ల గంగరాజు, బత్తిన శ్రీనివాస్ తెలిపారు. భవనం ఆవరణలో పర్యావరణ హితాన్ని కోరుతూ నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి అతిథులుగా పంచాయతీ కార్యదర్శిలు మహమ్మద్ ఆలీ, తాతపూడి సుభాకర్ పాల్గొన్నారు.

నేడు ఎస్సై సురేష్‌కు వీడ్కోలు సభ

రాయవరం: రాయవరం ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్‌కు ఆదివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. పోలీసు స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో మూర్తినీడి రాము కల్యాణ మండపంలో వీడ్కోలు సభ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నరేష్‌కు స్వాగతం పలకనున్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండలంలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని భట్లపాలికలో 1, కుందూరులో 1 పోస్టు ఖాళీగా ఉందని ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం వారికి ప్రభుత్వం నియమించిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి 31న పోస్టింగ్ పత్రాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి దర్శనానికి శనివారం పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, టేకి గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

80 మందికి హోమియో మందుల పంపిణీ

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 80 మందికి హోమియో మందులు అందజేశారు. అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల నుంచి వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. సంస్థ చైర్మన్ అల్లూరి శ్రీనివాస చౌదరి యోగాభ్యాసంపై అవగాహన కల్పించారు.

రాయవరం: వెదురుపాక గ్రామంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లొల్ల గ్రామానికి చెందిన విశ్వమానవత ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వెదురుపాక పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలు పొందారు. హోమియో వైద్యురాలు సత్యవాణి రోగులకు వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అల్లూరి శ్రీనివాసచౌదరి, మానవత సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టండి

రామచంద్రపురం: ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలని జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో శనివారం మండల న్యాయ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై విద్యార్థులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థులు ఎలా నష్టపోయారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీనియర్ న్యాయవాది కె..రామచంద్రరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయిప్రసాద్ కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ ఏటి సత్యనారాయణ మూర్తి, న్యాయవాదులు పీవీఎస్ జానకీ, పిల్లా పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందుల వినియోగంపై జాగ్రత్తలు పాటించాలి

కాజులూరు: ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కాజులూరు మండల ఏవో వి.అశోక్ అన్నారు. శనివారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పంటలపై వినియోగించే ఎరువులు, పురుగుమందుల మోతాదుపై తగు సూచనలు చేశారు. పంటలపై అవసరాన్ని మించి ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేయరాదన్నారు. ఎరువులు, గుళికలు వేసేటప్పుడు పొలంలో నీరు తక్కువగా ఉండేలా జాగ్రత్త పడాలన్నారు.

ఓదూరు సర్పంచ్‌గా విమలకుమారి


అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వింజుమల్ల విమలకుమారి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరులో శనివారం జరిగిన సర్పంచ్ ఉపఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి చెందిన వింజుమల్ల విమలకుమారి 335 ఓట్ల మెజారిటీతో వైఎస్సార్ సీపీకే చెందిన బుంగా బుల్లమ్మాయిపై విజయం సాధించింది. ఇక్కడ సర్పంచ్ బుంగ మేరీ మృతితో ఉపఎన్నిక నిర్వహించారు. విమలకుమారి గత ఎన్నికల్లో బుంగ మేరీపై పోటీ చేసి ఓటమి పాలయింది. ఉప ఎన్నికల్లో ప్రజలు ఆమె వైపు మొగ్గు చూపారు. మొత్తం 10 పోలింగ్ బూత్‌లలో 1149 ఓట్లు పోలవగా పోటీలో నిలిచిన కోనాల అనంతలక్ష్మికి 1 ఓటు, తాతపూడి గంగాభవానికి 34 ఓట్లు వచ్చాయి. బుంగ బుల్లమ్మాయికి 381 ఓట్లు, వింజుమల్ల విమలకుమారికి 716 ఓట్లు పోలయ్యాయి. 14 ఓట్లు చెల్లుబాటు కాలేదు. నోటాకు 3 ఓట్లు వచ్చాయి.

టీడీపీ డీలా..

ఈ ఉపఎన్నికలో టీడీపీ తరఫున ఎన్నికల బరిలో నిలిచిన తాతపూడి గంగాభవాని, కోనాల అనంతలక్ష్మిలకు డిపాజిట్లు దక్కలేదు. ఒకరికి 1 ఓటు, మరొకరికి 34 ఓట్లు దక్కాయి. ఒక్క ఓటు సాధించిన అనంతలక్ష్మి తరఫున నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, 34 ఓట్లు సాధించిన టి.గంగాభవాని తరఫున ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించినా ఫలితం దక్కలేదు.

తాపేశ్వరం 14వ వార్డు సభ్యుడిగా వీరేంద్ర


వీరేంద్రకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి రాజు


వీరేంద్రను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: తాపేశ్వరం పంచాయతీ 14వ వార్డుకు నిర్వహించిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు మేడిశెట్టి వీరేంద్ర గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి పెంకే కనకలింగేశ్వరరావుపై 13 ఓట్లు ఆధిక్యతతో విజయం సాధించారు. ఎన్నికల అధికారి, ఎంపీడీఓ ఐ. రాజు పర్యవేక్షణలో ఉదయం ఏడు గంటలకు మొదలైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంటకు ముగిసింది. మొత్తం 507 మంది ఓటర్లకు గాను 372 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పంచాయతీ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు మొదలైంది. వీరేంద్రకు 191 ఓట్లు రాగా కనకలింగేశ్వరరావుకు 178 ఓట్లు పోలయ్యాయి. మూడు చెల్లని ఓట్లుగా గుర్తించారు. లెక్కింపు అనంతరం వీరేంద్రను విజేతగా ప్రకటిస్తూ ఎన్నికల అధికారి రాజు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. స్టేజ్- 2 అధికారి భీమరాజు, పంచాయతీ కార్యదర్శులు సుబ్బారావు, పి శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ బి. శివకృష్ణ బందోబస్తు నిర్వహించారు. ఉప ఎన్నికలో వీరేంద్ర గెలుపు పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, మండపేట సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, పార్టీ నాయకులు వీరేంద్రను సత్కరించారు.

యుద్ధ రహిత సమాజాన్ని నిర్మించాలి


వివిధ పోటీల్లో విజేతలతో డీఈఓ కమలకుమారి, విద్యాశాఖ అధికారులు

మండపేట: ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవిస్తూ యుద్ధ వాతావరణం లేని సమాజాన్ని నిర్మించాలని డీఈఓ ఎం. కమలకుమారి అన్నారు. హిరోషిమా, నాగసాకి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్లో ఇటీవల విద్యార్థులకు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు శనివారం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి డీఈఓ కమలకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రగతి సాధించాలని విద్యార్థులకు సూచించారు. శాస్త్రీయ అభివృద్ధి మానసిక వికాసానికి నాంది కావాలన్నారు. జిల్లా అకడమిక్ కో-ఆర్డినేటర్ బ్రహ్మానందం మాట్లాడుతూ హిరోషిమాపై జరిగిన అణుబాంబు ప్రయోగంతో కొన్ని లక్షల మంది చనిపోయారన్నారు. పాఠశాల హెచ్ఎం శోభావళి సమావేశానికి అధ్యక్షత వహించారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, క్విజ్ పోటీలకు 32 పాఠశాలలకు చెందిన 136 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు డీఈఓ కమలకుమారి బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఇంక్లూజు ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏఎంఓ రాంబాబు, ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి, సాహితీవేత్త వారణాసి సత్తిబాబు, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి డీఆర్పీ మేక రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎస్ఆర్ ట్రస్టు సేవలు భేష్

మండపేట: పేదల కోసం పదమూడున్నర సంవత్సరాలుగా ప్రతి నెలా క్రమం తప్పకుండా ఉచిత హోమియో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని నెక్ జాతీయ కమిటీ సభ్యుడు, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి అన్నారు. ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అర్తమూరులోని ట్రస్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 162వ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా బులిస్వామి రెడ్డి అందిస్తున్న సేవలను పేదలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలన్నారు. హోమియో వైద్యులు జ్యోతి, ప్రకాష్, బంగారయ్య, వీరభద్రరావు, పద్మావతిలు 350 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ట్రస్టు ఆధ్వర్యంలో సుబ్బారెడ్డి ఉచితంగా మందులు అందజేశారు. ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి సత్యనారాయణ రెడ్డి, తాడి కోదండరామారెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, నాగిరెడ్డి, కొవ్వూరి గంగిరెడ్డి, సత్తి గోపాల్‌రెడ్డి, తాడి రామారెడ్డి, వెలగల శివారెడ్డి, తాడి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- నామవానిపాలెం గడప గడపకూ..


నామవానిపాలెంలో మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతుందని బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని నామవానిపాలెంలో శనివారం రాత్రి మంత్రి వేణుగోపాలకృష్ణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గత తెలుగు దేశం హయాం నుంచి పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు సీఎం జగన్ చెల్లుచీటి పలికారన్నారు. గతంలో ఏ చిన్న పనికైనా ప్రజలు జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచారన్నారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన ప్రతి పని వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారన్నారు. గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారని సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని పార్టీలు, వర్గవిభేదాలకు తావివ్వకుండా ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా వివిధ పథకాల లబ్ధి మొత్తం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో జమ అవుతుందన్నారు. అవ్వా, తాతలకు, వికలాంగులకు వలంటీర్ల ద్వారా పింఛను సొమ్ములు, రేషన్ బియ్యం నేరుగా వారి ఇళ్లకే అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో జగనన్న ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకూ రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, రైతులకు అవసరమైన పనిముట్లు, యంత్రాలు సబ్సిడీపై అందించడమే కాకుండా పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు నిపుణులతో అందిస్తున్నారన్నారు. కుల మతాలు, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్నామని భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు నరేన్, ఎంపీపీ మాత భారతి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసు, పల్లిపాలెం ఎంపీటీసీ మేడిశెట్టి శ్రీను, ఉప్పుమిల్లి సర్పంచ్ పెంకే సత్యనారాయణ, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, పార్టీ నాయకులు మడుకు రాంజీ, ఒర్రే రాము తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఫ్యామిలీ డాక్టర్

- పీహెచ్‌సీల్లో ఓపీ తగ్గడమే నిదర్శనం
- అందుబాటులో 172 రకాల ఔషధాలు
- డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర


రాయవరం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న దుర్గారావు దొర

రాయవరం: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నడుస్తోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎం అండ్ హెచ్‌వో) దుర్గారావుదొర తెలిపారు. రాయవరం పీహెచ్‌సీకి వచ్చిన సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రోజూ 36 గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రజలకు నేరుగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రతి గ్రామం నెలకు రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో కవర్ అవుతున్నందున ప్రజలకు గ్రామాల్లోనే పూర్తిస్థాయి వైద్య సేవలు అందుతుండడంతో పీహెచ్‌సీలో ఓపీ కేసులు తగ్గుతున్నట్టు గుర్తించామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నామన్నారు. ఇప్పటికే పంచాయతీ అధికారులు, సంక్షేమ వసతి గృహ అధికారులతో సమావేశం నిర్వహించామని ఆయన చెప్పారు. ఇప్పటికే నిర్వహించిన ఫీవర్ సర్వేలో 119 మంది జ్వర బాధితులను గుర్తించామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 12 డెంగీ కేసులు నమోదయ్యాయని, అయితే అందరూ సురక్షితంగా ఉన్నట్టు తెలిపారు. ఎక్కడా మందుల కొరత ప్రసక్తి లేదన్నారు. జిల్లా ఆస్పత్రి, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గతంలో కంటే 20 శాతం పెరిగాయన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు దుర్గారావుదొర తెలిపారు. జిల్లాలో నెలకు 2,200 వరకు ప్రసవాలు జరుగుతున్నాయన్నారు.

సంతృప్తికరమైన సేవలు అందించాలి

పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరమైన సేవలు అందించాలని డీఎంఅండ్ హెచ్‌వో దుర్గారావుదొర వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. రాయవరం పీహెచ్‌సీని ఆయన శనివారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీ ద్వారా రోగులకు అందుతున్న సేవలను పీహెచ్‌సీ వైద్యాధికారి దేవిరాజశ్రీ డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొరకు వివరించారు. ఆస్పత్రిలో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిని పరిశీలించారు. శిథిలస్థితిలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని ఆయన పరిశీలించి, ఆస్పత్రి భవనాన్ని ప్రజాప్రతినిధుల సహకారంతో మరో భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పీహెచ్‌సీలో పోస్టులు భర్తీ చేయాలని వినతి

మండపేట: మండలంలోని ద్వారపూడి పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం పీహెచ్‌సీని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం. దుర్గారావుదొరకు వినతిపత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్ఎన్ఓ, నైట్ వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. వాచ్‌మన్ లేక రాత్రివేళ ఆకతాయిల ఆగడాలతో వైద్య సిబ్బంది భయాందోళనలకు గురి కావాల్సి వస్తోందని వివరించారు. అలాగే వైద్యులు స్థానికంగా నివాసం ఉండటం లేదని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పీహెచ్‌సీ సిబ్బంది స్థానికంగా నివాసం ఉండేవారిని నియమించాలని కోరారు. ఆయా వినతులపై డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావుదొర సానుకూలంగా స్పందించినట్టు శేషారావు, శ్రీనివాసరావులు తెలిపారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

మండపేట: పట్టణంలోని టిడ్కో ప్లాట్లలో నివాసం ఉంటున్న ప్రజలు ఓటరు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్. సుధాసాగర్ కోరారు. ప్లాట్లలో నివాసం ఉంటున్న వారి వివరాలను అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సర్వే చేస్తున్నారన్నారు. నివాసితులు ఇప్పటి వరకూ ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో తమ ఓటు నమోదై ఉందో వారికి తెలియజేసి టిడ్కో ప్లాట్లు ఏరియాలోని పోలింగ్ కేంద్రం వద్దకు ఓట్లు బదిలీ చేయించుకోవాలని శనివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం


కుందూరు పీహెచ్‌సీ వద్ద రోగులకు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్స్

కె.గంగవరం: మండలంలోని దంగేరు శివారు రామఘట్టాల వద్ద శనివారం ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని మండల ఫొటోగ్రాఫర్స్ ఘనంగా నిర్వహించారు. తొలుత ఫొటోగ్రాఫర్ సృష్టికర్త లూయిస్ జాక్సన్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుందూరు పీహెచ్‌సీలో రోగులకు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఫొటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా నాయకులు కనికెళ్ల కనకరత్నం, ఫొటో గ్రాఫర్స్ మండల అధ్యక్షుడు అంబటి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాజులూరు: ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలని మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచంట సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని గొల్లపాలెంలో పెన్షనర్స్ హోమ్‌లో మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగూరే పుట్టినరోజు కేక్‌ను సంఘ నాయకులు కట్ చేసి సభ్యులకు పంచారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఒక కుల వృత్తిదారులుగా సమానంగా గుర్తించి ఆర్థిక సహకారాలు, సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలన్నారు.